సన్న బియ్యం పంపిణీ



లింగాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, నాయకులు

మేడ్చల్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. శ్రీరంగవరం గ్రామంలోని రేషన్ షాపులో మేడ్చల్ మాజీ జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి,నాయకులు సన్న బియ్యం పంపిణీ చేశారు. లింగాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ సంజీవరావు, నాయకులు ప్రారంభించారు.

బియ్యం పంపిణీని పరిశీలించిన ఆర్డీఓ



కీసరలో సన్న బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి

కీసర: పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కీసరలోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన బియ్యం నాణ్యతను పరిశీలించారు. జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు తటాకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం



కీసర: కీసర పెద్దమ్మ ,పెద్దిరాజు శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మునిరాజు కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, శ్రీ సూక్త హోమం, అనంతరం వద్ద పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణం, శ్రీ రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మునిరాజుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



మేడ్చల్ రూరల్: మేడ్చల్ పెద్ద చెరువు శిఖం భూమిలోని అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తొలగించారు. గౌడవెల్లి గ్రామ రెవెన్యూకు సంబంధించిన భూమి మేడ్చల్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, శిఖంలో ఉంది. గతంలో ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ఆ హద్దులను ఓ వెంచర్ నిర్వాహకులు తొలగించి, మట్టితో పూడ్చి వేస్తూ వచ్చారు. ప్రహరీ ఏర్పాటు చేశారు. విషయంలో ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జేసీబీ సాయంతో ఎఫ్‌టీఎల్, శిఖం భూమిలోని నిర్మాణాలను తొలగించారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపేయాలి

గౌతంనగర్: హెచ్‌సీయూలో 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నరహరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భూముల వేలం అడ్డుకున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం చేసి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ చేసి విద్యార్థులను వెంటనే విడుదల చేయాలన్నారు. తక్షణమే హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలని, అఖిలపక్షంతో చర్యలు జరిపి విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల అషుతోష్, బైరు అనిల్‌కుమార్, బండారి రవి, శ్రీధర్, రాంమోహన్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని డాక్టర్లతో వైద్యం..

● భవిష్య వెల్ విషర్ ఆసుపత్రికి రూ.5 లక్షల జరిమానా ● డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని చెంగిచర్ల భవిష్య వెల్ విషర్ ప్రైవేట్ ఆసుపత్రిలో అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్య సేవలు అందించటాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. ఆసుపత్రిలో అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడంతోపాటు అర్హత లేని సిబ్బందిని నియమించారన్నారు. అధిక శక్తి కలిగిన మాత్రలను రోగులకు వినియోగించటంతోపాటు అనధికార వైద్య చికిత్సలను చేయటాన్ని ఆసుపత్రిలో గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బంది కూడా ఆసుపత్రిలో లేరన్నారు. బుధవారం ఆకస్మికంగా చెంగిచర్ల భవిష్య వెల్ విస్సర్ ప్రైవేట్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనఖీ చేయగా .. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధలు ఉల్లఘించిన భవిష్య వెల్ విస్సర్ ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5 లక్షల జరిమానా విధించటంతోపాటు ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. యాజమాన్యంపై ఈ మేరకు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు జప్తు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఈ తక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. డీఎంహెచ్ఓ డాక్టరు సి. ఉమాగౌరీతో సహా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీతా, అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు వినోద్, రెవిన్యూశాఖ , పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్న



పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌యాదవ్ తదితరులు

జవహర్‌నగర్: బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీ అంబేద్కర్ ఆడిటోరియంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్, పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, గుండ్లపోచంపల్లి అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, ఘట్‌కేసర్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్ పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య జయంతి

సాక్షి, సిటీబ్యూరో: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో గురువారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, కురుమ సామాజిక సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

సాక్షి, సిటీబ్యూరో: బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద డీఆర్ఓ హరిప్రియ, అధికారులు నివాళులర్పించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు రాజీవ్ యువ వికాసం పథకం

అర్హులు 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిరి జిల్లా షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) ఆధ్వర్యంలో ఎస్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'రాజీవ్ యువ వికాసం పథకం'ప్రకటించిందని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 21–55 సంవత్సరాలు కలిగి ఉన్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు, 21–60 సంవత్సరాలు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

కుషాయిగూడ: యాంటీ డ్రగ్ సోల్జర్స్, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ సంయుక్తంగా ఈసీఐఎల్‌లోని ఎస్ఆర్ డీజీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వారికి వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. సైబర్ నేరాలపై కూడా వారికి అవగాహన కల్పిస్తూ.. అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై హనుమాన్‌నాయక్, రాజు, మోహన్‌పాటిల్, ముక్కంటి, శ్రీశైలం తదితరులున్నారు.

బస్ స్టాప్‌ను సర్వే స్థలంలోకి మార్చాలి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ బస్‌స్టాప్ వల్ల జిల్లా, సిటీ బస్సుల రద్దీ కారణంగా నిత్యం ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, సీపీఐ నేతలు ఉప్పల్ ట్రాఫిక్ జోన్–1 డీసీపీ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్.బోస్, ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి దామోదర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులపైన ఉంటుందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో ప్రజల సౌకర్యార్థం బస్సుషెల్టర్‌గా వినియోగిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు డీసీపీని కోరారు. దీనిపై డీసీపీ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ధర్మేందర్, సత్యప్రసాద్ తదితరులున్నారు.

రూ.6.2 కోట్లతో అభివృద్ధి పనులు



బాక్స్‌డ్రైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మీన

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ ఎంప్లాయీస్ కాలనీ నుంచి సాయికృష్ణ ఎన్‌క్లేవ్ వరకు రూ.6.2 కోట్లతో నిర్మించే బాక్స్‌డ్రైన్ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆదిత్య, పరమేష్‌శర్మ, సత్యనారాయణ, రాజిరెడ్డి, పర్వతాలు, శ్యామ్, సాయి, పవన్, నవీన్‌గౌడ్, అల్బర్ట్, పంకజం, సుదర్శిని, శాలిని, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు చేయండి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేయాలని మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్‌కు కార్పొరేటర్ శ్రవణ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పలుచోట్ల రోడ్లపై గుంతలు ఉన్నాయని, చెట్లకొమ్మలు తొలగించి, వెలగని విద్యుత్‌దీపాలకు మరమ్మతులు చేయించాలని కోరామన్నారు. పండుగ రోజు దేవాలయాల వద్ద ప్రత్యేక శానిటేషన్ ఏర్పాట్లు, దోమల బెడద లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఆశాలతను కలిసిన కార్పొరేటర్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసిన వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సునీల్, నాగరాజు, వెంకట్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా చూడాలి



కుషాయిగూడలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ప్రభుత్వ పథకాను పేదలు సద్వినియోగం చేసుకుని, పక్కదారి పట్టకుండా అధికారులు చూసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన కుషాయిగూడలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సన్నబియ్యం పథకం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గంలో నివసించే కార్మికులు, పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డీఎస్ఓ సుగుణబాయి, సంధ్య, శీనయ్య, స్థానిక నేతలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, మహేష్‌గౌడ్, యాదయ్య, విద్యాసాగర్, చక్రపాణిగౌడ్, వినోద్, అనిల్, గంప కృష్ణ, కనకరాజుగౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్



గౌతంనగర్: డివిజన్ పరిధి ఐఎస్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తు, మహాత్మగాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధాంతాలను విస్మరిస్తుందన్నారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, రాంచందర్, నాగరాజు, సత్యనారాయణ, ఫరీద్, యూసుఫ్, కొమురయ్య, బాలరాజుయాదవ్, సంపత్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ధర్మేష్‌యాదవ్, ఇస్తారి, శ్రీనివాసచారి, విజయలక్ష్మి, కనకలక్ష్మి, ఆగమయ్య, సిరిగిరి రాజు తదితరులున్నారు.

బాలిక అదృశ్యం



గణశ్రీ (ఫైల్)

ఘట్‌కేసర్: పట్టణంలో ఓ బాలిక అదృశ్యమైంది. ఈ సంఘటన బుధవారం కలకలం లేపింది. గుర్తు తెలియని వ్యక్తులు బాలికను అపహరించారని వదంతులు రావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన మేరకు.. భువనగిరి హనుమాన్ వాడకు చెందిన గుంజ స్రవంతి అలియాస్ స్వరూప, రాజశేఖర్ దంపతులు కూతురు గణశ్రీ (10), ఓ కుమారుడితో కలిసి రెండు నెలల క్రితం జీవనోపాధి కోసం వచ్చి డీపీఎస్ స్కూల్ ఎదురుగా నివసిస్తున్నారు. 12 గంటల ప్రాంతంలో తల్లి ఇళ్లల్లో పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికిన ఆచూకి లభించపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి బాలిక కోసం గాలించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. కాగాబాలిక అదృశ్యంపై తల్లితండ్రులు, బాలిక అమ్మమ్మ, బంధువులు పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానాలు రేకెత్తుతున్నాయి. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు అనుమానాస్పద అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



అజితేష్ (ఫైల్)

పోచారం: పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. సీఐ రాజు తెలిపిన మేరకు.. కరీంనగర్‌కు చెందిన జీ.అజితేష్ (20) యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ అదే ప్రాంతంలో అద్దె ఇంట్లో క్లాస్‌మేట్‌తో కలిసి ఉంటున్నాడు. మార్చి 23న తన స్వగ్రామానికి వెళ్లి 28న తిరిగి వచ్చాడు. అదే రోజు కళాశాలలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు హాజరై మరుసటి రోజు సాయంత్రం వారాసిగూడలోని తన స్నేహితుడు ఇంటికి బైక్‌పై వెళ్లాడు. మార్చి 29 సాయంత్రం 5:20 సమయంలో రూమ్‌మేట్‌కు ఫోన్ చేసి క్యాబ్‌లో వస్తున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత అతని ఫోన్ కలవలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి రామకృష్ణ పోలీస్ స్టేషన్‌లో బుధవాం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి

శామీర్‌పేట్: గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎల్లం డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలంటూ శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామపంచాయతి కార్యాలయం ఎదుట గత రెండు రోజులుగా పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాలో బుధవారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో పనులు చేయించుకుంటూ వేతనాలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే బకాయిలుగా ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని లేదంటే పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కీసర: వాటర్ ట్యాంకర్ బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం కరీంగూడ ఓఆర్ఆర్ సర్వీస్ రహదారిలో చోటు చేసుకుంది. కీసర పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా మునీరాబాద్‌కు చెందిన సత్యనారాయణ(38) వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సర్వీసు రోడ్డు పక్కనున్న చెట్లకు నీళ్లు పోస్తుండగా వాటర్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్ రాంబాబు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లారు. ఇరుక్కుపోయిన అతన్ని బయటకు తీశారు. డ్రైవర్ సత్యనారాణ ఎడమ చేయి పూర్తిగా విరిగిపోయింది. క్షతగాత్రుడికి అత్యవసర చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. 108 వాహన సిబ్బందిని ఆసుపత్రి వైద్యులు, పోలీసులు అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



ఘటనా స్థలంలో మృతిచెందిన వృద్ధురాలు

శామీర్‌పేట్: ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ములుగు మండలం, లక్ష్మక్కపల్లికి చెందిన చిరబోయిన శివమ్మ (70) శామీర్‌పేట బస్‌స్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తోంది. సిద్దిపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు వృద్ధురాలిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి జైలు

అల్వాల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మేడ్చల్, మల్కాజిగిరి న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 డిసెంబర్ 11న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన ఠాకూర్ సంజయ్ (21)పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టుకు పోలీసులు సాక్షాలు సమర్పించగా.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

మల్కాజిగిరి: అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా, డీజే ఉపయోగించిన మాజీ కార్పొరేటర్‌పై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో మాజీ కార్పొరేటర్ మురుగేష్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా రోడ్డుపై డీజే ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించడమే కాకుండా డ్రోన్ కెమెరా ఉపయోగించారని ఆదర్శ్‌నగర్‌కు చెందిన బుసపాక శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

కుషాయిగూడ: గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు రాజేష్ (6) నిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై హరిందర్ తెలిపారు. బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పిన ఇన్నోవా వాహనం ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టిన ఘటనలో కొంటిపాటి పుల్లారావు అక్కడిక్కడే మృతిచెందగా.. భార్య నాగరాజ్, కుమారులు రుత్విక్, రాజేష్‌లు గాయపడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్ మృతిచెందినట్లు పోలీసులు ప్రకటించారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు సమాచారం.

త్వరలోనే శ్మశానవాటిక సుందరీకరణ పనులు



చర్లపల్లి శ్మశానవాటిక వద్ద స్థానికులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణకు రూ.6 కోట్లు నిధులు మంజూరు కావడంతో బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు ఒకే చోట నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో పాత సమాధుల కూల్చివేతలు చేపట్టబోమని స్పష్టం చేశారు. బర్నింగ్ ఫ్లాట్ ఫామ్ అన్ని రకాల వసతులతో చర్లపల్లి శ్మశానవాటిక ఆధునాతన శ్మశానవాటికగా మారునుందన్నారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ స్థానిక నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు హర్షం..

కుషాయిగూడ: చర్లపల్లి శ్మశానవాటిక సుందరీకరణకు రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. బుధవారం పార్టీ నేతలు వివిధ మతాల ప్రతినిధులతో కలిసి శ్మశానవాటికను సందర్శించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, బొడిగె రాజుగౌడ్, దప్పు గిరిబాబు, ఎంకిరాల నర్సింహ్మా, కాసుల ఆనంద్ రాజ్, కడియాల బాబు, కొమ్ము రమేష్, నరసింహ, బాలరాజు, ఫయాజ్, రెడ్డినాయక్, బివి. పాల్, శ్యాముల్ తదితరులున్నారు.